క్లుప్తంగా

నేడు కాళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కాళ్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.స్వాతి శుక్రవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శిరీష విశ్వనాథరాజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు,, చేపట్టాల్సిన పనులపై సమీక్షించనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

గ్రామాల్లో ఆధార్ శిబిరాలు



కోరుకొల్లులో ఆధార్ శిబిరంలో ప్రజలకు సేవందిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని పాలకోడేరు, కోరుకొల్లు, పెన్నాడ, శృంగవృక్షం గ్రామాల్లో శుక్రవారం ఆధార్ శిబిరాలు నిర్వహించారు. ఆధార్ కార్డులు అప్‌డేట్, కార్డులు లేనివారికి ఆధార్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నూకల మురళి గంగాధర్‌రావు మాట్లాడుతూ ఆధార్ శిబిరాల ద్వారా మండలంలో 306 మందికి సేవలు అందించామన్నారు. 2016 సంవత్సరానికి ముందు ఆధార్ కార్డులు తీసుకున్నవారు మళ్లీ ఆధార్ తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

ఆకివీడు: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గంలో స్థానం పొందిన నియోజకవర్గ నాయకులు కష్టపడి పనిచేసి పార్టీ మరింత అభివృద్ధికి కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గంలో కార్యనిర్వాహక సభ్యులుగా నియమితులైన స్థానిక పట్టణ నాయకులు శిరపు శ్రీనివాస్, మోరా జ్యోతి శుక్రవారం పీవీఎల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ జిల్లా కమిటీలో పదవులు పొందిన వారంతా పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారుల్ని, ప్రజల్ని మోటివేషన్ చేసి పార్టీపై వారిలో ఆదరాభిమానాలు పెంపొందించే విధంగా సహకరించాలన్నారు. తమకు కేటాయించిన పదవులకు వెన్న తెచ్చేలా, పార్టీ అభివృద్ధికి, వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేలా కృషి చేస్తామని శ్రీనివాస్, జ్యోతి విలేకర్లకు చెప్పారు.

అవసరానికి మించి ఎరువులు వాడొద్దు



తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం గ్రామంలో పొలంబడి కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పంట అవసరాలకు మించి ఎరువులు వాడొద్దని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో రైతులకు మంచి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ అధిక మోతాదులో ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు పంటలకు దోమ ఉధృతి పెరుగుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ రైతు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ పథకం సొమ్ములు పడని రైతులు వెంటనే ఆర్‌బీకేలను సంప్రదించాలన్నారు. ఇదిలా ఉంటే, 40 శాతం రాయితీపై రైతు గ్రూపులకు డ్రోన్లను అందిస్తామన్నారు. ఆసక్తి గల రైతులు తనను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఆంజనేయులు, రైతులు ఉమా, రామకృష్ణ, గంగాధర్, శివయ్య, శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

యలమంచిలి: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ కొంతేరు గ్రామ కమిటీ అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ జక్కంశెట్టి భాగ్యలక్ష్మి తెలిపారు. జగనన్న సురక్ష పథకం కింద దరఖాస్తు చేసుకున్న 21 మందికి బియ్యం కార్డులను శుక్రవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ లంచాలు, సిఫార్సులకు తావులేకుండా ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని ప్రజలంతా మరొకసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ గౌరవాధ్యక్షుడు పోలుకొండ ఏలియా భక్తసింగ్, ఉపాధ్యక్షుడు కొయ్యే నాగేశ్వరరావు, కార్యదర్శి పోలుకొండ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా రాజేష్, ఉప ప్రధాన కార్యదర్శి తెన్నేటి అలగ్జాండర్, సచివాలయ కన్వీనర్ జోగి రాజేష్, మండల ఎస్సీ సెల్ సభ్యుడు లంక చిరంజీవి, పలువురు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో నియోజకవర్గంలో చేపట్టిన గృహ నిర్మాణాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు సొంతిల్లు ఉండాలనే ఆనాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి భూసేకరణ చేసి గృహ నిర్మాణాలు చేశారని గుర్తు చేశారు. నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్రంలో సుమారుగా 30 లక్షల మందికి పైగా ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు కూడా ఇచ్చారన్నారు. అంతేకాక గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల నిధులు ఇవ్వడంతో పాటు బ్యాంకుల నుంచి మరో రూ.30 వేల వరకు రుణాలు కూడా అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జగనన్న కాలనీల పేరుతో కొత్తగా ఊళ్లకు ఊళ్లు ఏర్పడుతున్నాయని ఆయన అన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేయాలని, అప్పుడే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యం నెరవేరినట్లు అవుతుందన్నారు. భీమవరం నియోజకవర్గంలో దాదాపుగా 15 వేల మందికి పైగానే పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసి పట్టాలు ఇచ్చారని, వీరిలో ఎక్కువ మంది గృహ నిర్మాణాలు చేసుకుంటున్నారని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా గృహ నిర్మాణాలు చేసుకునేలా హౌసింగ్ అధికారులు వారికి అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఈఈ వేణుగోపాల్, మున్సిపల్ ఎంఈ త్రినాధరావు, ఎంపీడీవో వెంకటలక్ష్మి, ఏఈలు శశికుమార్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



పెద అమిరంలో దివ్యాంగులకు మోటార్ వెహికల్స్ పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

కాళ్ల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. కాళ్ల మండలం పెద అమిరం గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం దివ్యాంగులకు మోటార్ వెహికల్స్ పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 10 మంది దివ్యాంగులకు రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా ఈ వెహికల్స్ అందజేశారు. కాళ్ల మండలానికి రెండు, ఆకివీడుకు రెండు, ఉండికి మూడు, పాలకోడేరుకు మూడు చొప్పున మోటార్ వెహికల్స్ మంజూరయ్యాయి. ఈ సందర్భంగా నర్సింహరాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల, మత, రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని, దివ్యాంగులకు సైతం పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంఘ రాష్ట్ర చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా దివ్యాంగుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో 1,750 మంది దివ్యాంగులకు మోటార్స్ వెహికల్స్ మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాళ్ల, ఉండి జెడ్పీటీసీలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, రణస్థుల కనకదుర్గ మహంకాళి, కాళ్ల, ఆకివీడు, ఉండి ఎంపీపీలు పెనుమత్స విశ్వనాథరాజు, కఠారి జయలక్ష్మి, ఇందుకూరి హరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గణేశ్న రాంబాబు, పెనుమత్స ఆంజనేయరాజు, పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజు, పీవీఎల్‌ను కలిసిన యేడిద



డీసీసీబీ చైర్మన్ పీవీఎల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన యేడిద వెంకటేశ్వరరావు, నాయకులు

ఉండి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాధరాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజును శుక్రవారం జిల్లా నూతన కమిటీ ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆచంటలో రంగనాథరాజును, పెదఅమిరంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పీవీఎల్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇంతటి బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రంగనాథరాజు, పీవీఎల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, రాబోయే ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళతానని అన్నారు. నూతన కమిటీ జిల్లా ఎగ్జిక్యూటీవ్ సభ్యుడు బొచ్చా అచ్చారావు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యులు రణస్థుల కనకదుర్గ, కరిమెరక చంద్రరావు, రణస్థుల మహంకాళి, కరిమెరక శివనాగరాజు, గుండాబత్తుల సుబ్బారావు, గలావిల్లి ధనుంజయ, అంగర రాంబాబు, శేషాద్రి శ్రీను, రాయి సతీష్, వరప్రసాద్, వగ్రే పైడియ్య, సూరవరపు వెంకటాచార్యులు, బొడ్డు నాగన్న పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో శ్రావణ శోభ



ఆకివీడులో వనువులమ్మవారు, మావుళ్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా పట్టణంలోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భీమవరం శ్రీ మావుళ్ళమ్మ, గునుపూడిలోని ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ, మెంటేవారితోటలోని బాల త్రిపురసుందరి దేవి, శ్రీరాంపురం కనకదుర్గ అమ్మవారి దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మావుళ్ళమ్మ ఆలయంలో ఈవో యర్రంశెట్టి భద్రాజీ పర్యవేక్షణలో అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు

కాళ్ల: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతన దంపతులు, మహిళలు, చిన్నారులు సైతం ఎంతో నియమనిష్ఠలతో అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ప్రధానంగా కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీ అమ్మవారికి, భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ డీవీ కృష్ణంరాజు, ఆలయ ఈవో ఎం.అరుణకుమార్ ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ఆకివీడు: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవార్ల ఆలయాల్ని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అనంతరం స్థానిక పెద్దింటి అమ్మవారు, వనువులమ్మ, గంగానమ్మ, పార్వతీ సమేత వేంకట లింగేశ్వరస్వామి, రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయాల్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దింటి అమ్మవారిని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

దోమల నివారణ సామాజిక బాధ్యత



తాడేపల్లిగూడెం పట్టణంలో ఫ్రైడే డ్రైడే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమల నివారణ అందరి సామాజిక బాధ్యత అని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని యాగర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి అక్కడి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, గృహ యజమానులకు సూచనలు చేశారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయని, ఇంటి ఆవరణలో పొడి వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు ఝాన్సీ లక్ష్మీబాయి, వెంకటలక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఎస్.ప్రసాద్ బాబు, కాంతారావు, రామకృష్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు మోహన్‌రావు, మెర్సీ, శానిటేషన్ కార్యదర్శి శ్రీదేవి, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దరిచేరవు

పెంటపాడు: దోమల నివారణతో వ్యాధులు దరిచేరవని ముదునూరు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ ఎస్వీ రమణ, గూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై. వీ లక్ష్మణరావు పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో దళితులకు అధిక ప్రాధాన్యం

పాలకొల్లు అర్బన్: నియోజకవర్గంలో దళితులకు నామినేటెడ్ పదవులు, ఇతర పార్టీ పదవుల్లో అధిక ప్రాధాన్యత ఇస్తానని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. యాళ్లవాని గరువు పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాలమహానాడు (పీవీరావు) రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాదరావు, దళిత నాయకులు గోపిని కలిసి శాలువాతో సత్కరించి, అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో పాలకొల్లులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడానికి పూర్తిగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొర్రపాటి వీరాస్వామి, దళిత నాయకులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్ నర్సయ్య అగ్రహారానికి చెందిన కె.వరలక్ష్మిని ఆర్.సాయి అతని భార్య, సింగ్ అనే వ్యక్తులు కొట్టారంటూ ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు. సీఐ అడబాల శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉండిలో మంత్రి కారుమూరి పర్యటన

ఉండి: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శనివారం మహదేవపట్నంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు చెప్పారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో మహదేవపట్నంలో రూ.1.30 కోట్లతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయ భవనాలు, రెండు రైతు భరోసా కేంద్ర భవనాలను ఉదయం 9 గంటలకు మంత్రి నాగేశ్వరరావు, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, పీవీఎల్ చేతుల మీదుగా ప్రారంభించనునన్నట్లు తెలిపారు. అనంతరం పాలకోడేరు మండలం గరగపర్రులో రూ.27 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నేడు అలంపురంలో మెగా వైద్యశిబిరం

పెంటపాడు: అలంపురంలో వెంకటరమణసేవా చారిటీ ఆసుపత్రిలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో విజయవాడకు చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేష్, హైదరాబాద్ అపోలో ఆసుపత్రికి చెందిన గాంగ్రీన్ (షుగర్‌క్రానిక్) వైద్యనిపుణులు రాజశేఖర్‌లతో పాటు, రాజమండ్రి జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి చెందిన ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు, గుండె వైద్యనిపుణులు పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. రోగులకు ఉచిత భోజన సదుపాయాలు కల్పించినట్లు కృష్ణంరాజు వెల్లడించారు. ఈనెల 26న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించబోయే ఈ శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భీమవరంలో కలెక్టర్ విస్తృత పర్యటన



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మున్సిపాలిటీలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, ఓటర్ల జాబితా సర్వేను శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత జేపీ రోడ్డు అయ్యప్ప స్వామి గుడి 34వ వార్డు ప్రాంతంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న డ్రెయిన్ పరిశీలించారు. డ్రెయిన్ నిర్మాణం కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. అనంతరం 20వ వార్డులోని ఎడ్వర్డ్ ట్యాంక్ వద్ద డ్రెయిన్ పరిశీలించి పనులను త్వరితగతిన చేపట్టాలని, ట్యాంక్ చుట్టుపక్కలా మొక్కలు నాటడం, వాకింగ్ పాత్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తర్వాత బీసీ కాలనీలో అమృత్ 2.0 నిధులు రూ.2.14 కోట్ల వ్యయంతో నిర్మించిన 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను సందర్శించారు. పైపులైన్ పనులను త్వరగా పూర్తిచేసి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటర్ ట్యాంక్ మార్గంలో రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలను రూపొందించాలన్నారు. ఒకటో వార్డు సీపీఎం కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు, వంతెన ప్రాంతాన్ని పరిశీలించారు. వంతెన మార్జిన్‌లో నీరు నిలవకుండా పనులను చేపట్టాలన్నారు. చివరిగా శ్రీ అడబాల వెంకట చంద్రరావు మున్సిపల్ స్పెషల్ ప్రాథమిక పాఠశాల వద్ద ఓటర్ల సర్వేపై బీఎల్‌వోలతో మాట్లాడారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కలెక్టర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ త్రినాధరావు, ఇన్‌చార్జ్ డీఈ, పబ్లిక్ హెల్త్ ఈఈ విజయ్, ఏఈ నవ్య తదితరులు ఉన్నారు.

బోసన్ మోటార్స్‌తో 'ఎస్ఆర్‌కేఆర్' ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న కళాశాల కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత్ వర్మ

సాక్షి, భీమవరం: ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బోసన్ మోటార్స్ సంస్థతో ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, బోసన్ మోటార్స్ సంస్థ డైరెక్టర్ సూరి భూపతిరాజు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ నిశాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు ఇంటర్న్‌షిప్, వర్క్‌షాప్‌లోనూ వివిధ విభాగాల్లో శిక్షణ వంటి అంశాలు ఒప్పందంలో ఉన్నాయన్నారు. అమెరికాలో ప్రముఖ స్టార్టప్ కంపెనీగా పేరుపొందిన ఈ సంస్థకు భారత్‌లోని చెన్నై, తిరుపతిలో కూడా ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం హెడ్ డాక్టర్ బీఆర్‌కే వర్మ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, ట్రిపుల్ ఈఈఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.కాంతారావు, శ్రీనివాస్, డాక్టర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలవపూడిలో వైద్య శిబిరం



కలవపూడిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: శివారు గ్రామ ప్రజలకు బైర్రాజు ఫౌండేషన్ ద్వారా వైద్య సేవలు అందించడం అభినందనీయమని పలువురు నాయకులు కొనియాడారు. బైర్రాజు ఫౌండేషన్, హెచ్‌పీ వావ్ బస్సు వారోత్సవాలలో భాగంగా కలవపూడిలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా సుమారు 250 మంది రోగులకు సుగరు, బీపీ పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, పరిరక్షణ, పర్యావరణం, ఆధునిక విద్య, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌పై దృశ్య రూపంలో వివరించారు. అదే విధంగా గ్రామంలోని మహిళలకు డిజిటల్, ఫైనాన్షియల్ లిటరసీ మీద కాలేజీ విద్యార్థులతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వికాస సమితి కన్వీనర్ మంతెన శ్రీనివాసరాజు, పంచాయతీ కార్యదర్శి ఎం.అనూష, బైర్రాజు ఫౌండేషన్ కో-ఆర్డినేటర్స్ పెనుమాక భానుమూర్తి, తంగెళ్ల పద్మారావు, ఆరోగ్య కో-ఆర్డినేటర్ ఎంఆర్‌కే రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే ప్రారంభం

పాలకోడేరు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాల్లో లబ్ధిదారులు సిటిజన్ ఔట్రీచ్ సర్వే శుక్రవారం పాలకోడేరులో నుంచి ప్రారంభమైంది. వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి, ఇంటింటికీ తిరిగి పథకాలు అందరికి అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. కాపు నేస్తం ఐదో విడత, వైఎస్సార్ చేయూత నాలుగో విడత నిధులు త్వరలో విడుదల అవుతాయని, ఇంకా లబ్ధిదారులు ఎవరైనా ఏదైనా కారణాల వల్ల మిగిలిపోయారా అని విచారణ చేస్తున్నారు. జగనన్న సురక్ష పథకంలో దరఖాస్తు చేసుకున్నవారందరికీ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నూకల మురళి గంగాధర్‌రావు మాట్లాడుతూ సిటిజన్ ఔట్రీచ్ సర్వే రెండు రోజులపాటు నిర్వహిస్తామని సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి నివేదకను ఉన్నతాధికారులు పంపిస్తామన్నారు. వెంకటరాజు, మహాలక్ష్మి, పూర్ణిమ అధికారులు సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటలు ముఖ్యమే



స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న సీఐ శ్రీనివాస కుమార్

యలమంచిలి: విద్యార్థికి చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమని పాలకొల్లు రూరల్ సీఐ కొండవీటి శ్రీనివాస కుమార్ అన్నారు. మేడపాడు గ్రామంలోని సీఎంఎస్‌లో చదువుతున్న అనాథ బాలలకు తన మిత్రుడు గార్ల మైనర్‌బాబుతో కలిసి శుక్రవారం ఆయన స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. సీఐ మాట్లాడుతూ వ్యక్తి మానసిక వికాసానికి చదువు ఎంత ముఖ్యమో, శరీర ధారుడ్యానికి ఆటలు అంతే ముఖ్యమన్నారు. పిల్లలకు సుమారు రూ.10 వేలు విలువ చేసే క్రికెట్, వాలీబాల్ కిట్లు, క్యారమ్ బోర్డులు, స్కిప్పింగ్ రోప్స్ అందజేశారు. సీఎంఎస్ వార్డెన్ పడాల జ్ఞానప్రకాష్, ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్, పాలకొల్లు రూరల్ ఎస్సై ఎస్.శ్రీనివాస్, మహిళా పోలీస్ భాను పాల్గొన్నారు.